క్లుప్తంగా

మాలలపై కూటమి ప్రభుత్వం కక్ష

ఒంగోలు వన్‌టౌన్: కూటమి ప్రభుత్వం మాలలపై కక్ష గట్టిందని జై జనం పార్టీ అధ్యక్షుడు చప్పిడి రవిశంకర్ పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆపార్టీ ఆధ్వర్యంలో గురువారం ఒంగోలు కోలాస్ సెంటర్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ నిర్ణయాన్ని వెంటనే ఉప సంహరించుకోవాలన్నారు. వర్గీకరణ ఏకపక్షంగా సుప్రీంకోర్టు నిబంధనలకు విరుద్ధంగా చేపట్టారన్నారు. 2026 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ వర్గీకరణను చేపట్టాల్సి ఉండగా, 2011 జనాభా లెక్కల ప్రకారం వర్గీకరణ చేయడం దారుణమైన విషయం అన్నారు. రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఏసుదాసు, ఎస్‌కె జిలానీ, కె శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీల ఎంపిక

కొత్తపట్నం: జిల్లా వైఎస్సార్ సీపీ ఆదేశాల మండలంలోని అన్ని గ్రామాల్లో పార్టీ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని గ్రామాల పార్టీ అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయాల కన్వీనర్లు, పార్టీ సీనియర్ నాయకులు, మహిళా, యూత్ కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. 28న గుండమాల, మోటుమాల, పాదర్తి, 29న కె.పల్లెపాలెం, రంగాయపాలెం, కొత్తపట్నం, 30న గమళ్లపాలెం, వజ్జిరెడ్డిపాలెం, రాజుపాలెం, 31న సంకువారిగుంట, ఈతముక్కల, మడనూరు, ఏపిల్ 1వ తేదీన ఆలూరు, గాదెపాలెం, అల్లూరు గ్రామాల కమిటీలు ఎంపికలు జరుగుతాయని, అందరు హాజరు కావాలని ఆయన ప్రకటనలో కోరారు.

ఈ-శ్రమ్ నమోదుకు నెలాఖరు చివరి తేదీ

ఒంగోలు వన్‌టౌన్: ఈ-శ్రమ్ పథకంలో దరఖాస్తులు చేసుకునేందుకు ఈనెల 31వ తేది చివరి తేది అని జిల్లా ఉప కార్మిక కమిషనర్ ఏ గాయిత్రీదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకాన్ని 2021లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించారని, అప్పటి నుంచి 31 మార్చి 2022 మధ్యలో మృతి చెందిన వారికి క్లెయిమ్ వర్తిస్తాయన్నారు. ఇప్పటి వరకు ఈ కాలంలో మృతి చెంది వారి కుటుంబ సభ్యులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోకపోతే, ప్రస్తుత నెలాఖరు వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. ఇతర పూర్తి వివరాలకు కార్మిక శాఖ కార్యాలయంలో గానీ, హెల్ప్ డెస్క్ 958104 33338 నంబరులో సంప్రదించాలన్నారు.

ఎస్సీ, ఎస్టీ కులాల సమస్యకు సమావేశం నిర్వహించాలి

ఒంగోలు వన్‌టౌన్: ఎస్సీ, ఎస్టీ కులాల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సమావేశం నిర్వహించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు గురువారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. గతంలో జిల్లా కలెక్టర్లు ఎస్సీ, ఎస్టీ సంఘాలతో సమావేశాలు నిర్వహించి వారి సమస్యలను తెలుసుకునేవారన్నారు. 2020 అనంతరం ఇటువంటి సమావేశాలను నిర్వహించలేదన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో దారా అంజయ్య తదితరులు ఉన్నారు.

ఎంపీడీవో కార్యాలయం పరిశీలన

మద్దిపాడు: జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఎం వెంకటేశ్వర్లు గురువారం మద్దిపాడు ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించారు. ప్రభుత్వం బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపులకు ఏర్పాటు చేసిన రుణాల మంజూరుకై తయారైన యాక్షన్ ప్లాన్‌లను రికార్డులను ఆయన పరిశీలించారు. రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న అర్జీలను పరిశీలించారు. సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ పథకం కింద మ్యాపింగ్ అయి ఉన్న టైలరింగ్ సెంటర్‌ల వివరాలను ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీడీవో డీఎస్‌వీ ప్రసాద్, ఈవోపీఆర్‌డీ రఘుబాబు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం


విద్యార్థులతో మాట్లాడుతున్న ఆనందమోహన్

మద్దిపాడు: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని పీహెచ్‌సీ డాక్టర్ ఆనందమోహన్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఆయన ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ పొడి దుస్తులు వేసుకోవాలని, ప్రతిరోజూ తప్పక స్నానం చేయాలన్నారు. వసతి గృహం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి తెలిపారు. అనంతరం 75 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ బాలకోటయ్య, ఏఎన్ఎం సుభాషిణి, వార్డెన్ రాఘవులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోవాలా.. బతుకు డీలా!

'ఏం ఆటో తమ్ముళ్లు మీరేం కంగారుపడొద్దు.. అధికారంలోకి వచ్చాక మీ అందరికీ ఏడాదికి రూ. 15 వేలు అందిస్తాం. జీవో 21 రద్దు చేసి జరిమానాల భారం తగ్గిస్తాం. అంతేకాదు గ్రీన్ ట్యాక్స్ కూడా తగ్గిస్తాం' అని ఊకదంపుడు ఉపన్యాసాలు చేశారు కూటమి నాయకులు. తగుదనమ్మా అని ఉమ్మడి మేనిఫెస్టోలో సైతం పెట్టారు. కాని తీరా చూసేసరికి రూపాయి కాదు కదా చివరికి వంద రూపాయలు కూడా ఇచ్చిన దాఖలాలు లేవు. దీంతో ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు నానా ఇబ్బందులు పడుతూ కుటుంబాన్ని ఎలా పోషించాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

- 10 నెలలు గడుస్తున్నా ఎన్నికల హామీ నెరవేర్చని కూటమి ప్రభుత్వం
- హామీ మేరకు ఏడాదికి రూ.15 వేలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్
- నియోజకవర్గంలో 1300 పైనే ఆటోలు
- గతంలో రూ.10 వేలు ఇచ్చి ఆదుకున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం


సంతనూతలపాడు ఆటోస్టాండ్‌లో ప్రయాణికులు లేక ఖాళీగా ఉన్న ఆటోలు

సంతనూతలపాడు: ఆటో డ్రైవర్ల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. కూటమి ప్రభుత్వం పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గిస్తామని చెప్పి మోసం చేసింది. ఇంతవరకు తగ్గించకపోడంతో ఆటో డ్రైవర్లకు తిప్పలు తప్పడం లేదు. ఆటో నడపడం ఆపలేక వేరే పనిచేయలేక దీనావస్థలో కొట్టుమిట్టాడుతున్నారు. దైనందిన జీవితంలో సంపాదన లేకపోవడంతో చాలీచాలని డబ్బులతో జీవనం ఎలా కొనసాగించాలా అని మథన పడుతున్నారు. ప్రస్తుతం లీటర్ డీజిల్ ధర రూ.99 వరకు ఉంది. ముఖ్యంగా ఆటోలను నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్న ఆటో డ్రైవర్లు బెంబేలెత్తిపోతున్నారు. సంతనూతలపాడు, చీమకుర్తి, చీమకుర్తి టౌన్, మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల్లో సుమారు 1300 వరకు ఆటోలు ఉన్నాయి. బస్సులు లేనప్పుడు ప్రయాణికులు ఆటోల పైనే ఆధారపడి గమ్యస్థానాలకు చేరుతున్నారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్సులు లేని గ్రామీణ ప్రాంతాలకు ఆటోలే ఆధారం. అయితే ఆటోలు నడిపే కార్మికుల పరిస్థితి మాత్రం అంత ఆశాజనకంగా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జగన్ ప్రభుత్వంలో కొండంత భరోసా..

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఆటో డ్రైవర్‌కు ఏడాదికి రూ.10 వేలు చొప్పున వారి ఖాతాల్లో జమచేశాడు. అర్హులైన ఆటో, ట్యాక్సీ, మాక్సీ క్యాబ్ డ్రైవర్లకు చెప్పిన విధంగా ఆదుకొని వారి కుటుంబాల్లో వెలుగులు నింపారు. దీంతో పాటు వాహన డ్రైవర్ ప్రమాదవశాత్తు మృతి చెందితే వారి కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల బీమా వర్తింపజేసి ఆదుకున్నారు.

ఆటో కార్మికులపై కూటమి నిర్లక్ష్యం..

కష్టాలలో ఉన్న ఆటో కార్మికులను ఆదుకునే విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆటో కార్మికులు విమర్శిస్తున్నారు. ఏడాదికి ఆటో కార్మికులకు రూ.15 వేలు చొప్పున ఇస్తామని, జీవో 21 రద్దు చేసి జరిమానాల భారం తగ్గిస్తాం అని చెప్పారు. వాహనాలకు గ్రీన్ ట్యాక్స్ కూడా తగ్గించి ఆదుకుంటామని ఉమ్మడి మేనిఫెస్టోలో పెట్టారు. అధికారం లోకి రాగానే హామీలు మరచిపోయారు. అధికారంలోకి వచ్చి 10 నెలలు గడిచినా హామీలు అమలు చేయడం లేదని ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు.


ప్రయాణికులను ఎక్కించుకుంటున్న ఆటో

తగ్గిన ఆదాయం.. పెరిగిన ఖర్చులు !

ఆటోలు నడపడానికి పలు రకాల నిర్వహణ ఖర్చులు ఉన్నాయి. ప్రస్తుతం పెరుగుతున్న డీజిల్, పెట్రోల్ ధరలతో ఆటో కార్మికుడికి రోజంతా కష్టపడితే రూ.200 నుంచి రూ.300 కూడా మిగలని పరిస్థితి నెలకొంది. ప్రతి ఏడాది ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్, సర్టిఫికెట్ల కోసం దాదాపు రూ.13 వేల దాకా ఖర్చవుతోంది. వీటితో పాటు తనిఖీల పేరుతో పోలీసులు, రవాణాశాఖాధికారులు దాడులు చేసి వేలాది రూపాయిలు జరిమానా విధిస్తున్నారు. ఆటో కొనుగోలు కోసం తీసుకున్న రుణాలకు నెలవారీ కిస్తీలు కట్టుకోలేక ఆటో కార్మికుల బతుకులు దినదినగండం నూరేళ్ల ఆయుష్షులాగా మారిపోయింది. వచ్చే అరకొర డబ్బులు డీజిల్‌కు పోతున్నాయని వాపోతున్నారు. ప్రస్తుతం చార్జీలకు ఆటోలను నడిపి, నెల వచ్చేసరికి తీసుకున్న ఫైనాన్స్ కట్టలేక ఆటో డ్రైవర్లు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

జగనన్నకు రుణపడి ఉంటాం..

ఇచ్చిన మాట ప్రకారం మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాకు ఏడాదికి రూ.10 వేలు అందించి ఆదుకున్నారు. ఆర్థికంగా వెసులుబాటు కల్పించడంతో చాలా సంతోషంగా ఉండేది. మా కుటుంబమంతా ఆయనకు రుణపడి ఉంటాం. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఇంతవరకు ఒక్క రూపాయి కూడా జమచేయ లేదు.

– ఎస్‌.షరీఫ్, యూనియన్ ఉపాధ్యక్షుడు, ఎస్‌ఎన్‌పాడు

ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయాలి..

రోజంతా కష్టపడి ఆటో తోలితే నాలుగు డబ్బులు ఇంటికి తీసుకెళ్లే పరిస్థితి లేదు. నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోవడంతో వాటిని కొనుగోలు చేయడానికి నానా ఇబ్బందులు పడుతున్నాం. అప్పులు చేసి ఆటోలు కొనుగోలు చేసి వాటి ఫైనాన్స్, పెరిగిన బీమా, ట్యాక్స్‌లు కట్టుకోలేక ఆటోలు నడపలేకపోతున్నాం. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.15 వేలు ఇచ్చి ఆదుకోవాలి.

– కంచు అశోక్, ఆటో డ్రైవర్, సంతనూతలపాడు

జగన్‌ను కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు


జగన్ మోహన్‌రెడ్డితో రవిబాబు, నాయకులు


మాజీ సీఎం జగన్‌ను కలిసిన అంజిరెడ్డి, నాయకులు

ఒంగోలు వన్‌టౌన్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరు రవిబాబు, కొత్తపట్నం మండల ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డిలు గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. వీరితో పాటూ నాయకులు వీఆర్‌సీ రెడ్డి, విశ్వనాథపల్లి ఆనందరావు, కారాని జయరావు, గాలి ముసలారెడ్డి, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసులు, పులుసు సురేష్‌బాబు, ఎస్కే కరీముల్లా, కొక్కిలగడ్డ నాంచార్లు, శ్రీరాములు, ఆదినారాయణ, బాలాజీ తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

సమాజ హితాన్ని కోరుకునేది కళారంగం

ఒంగోలు మెట్రో: కళారంగం ఎప్పుడూ సమాజ హితాన్నే కోరుకుంటుందని.. అటువంటి కళారంగం నేడు ఆదరణ కోల్పోతుందని ప్రజానాట్య మండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం ఒంగోలు సీవీఎన్ రీడింగ్ రూమ్ కళా ప్రాంగణంలో నాగినేని నరసింహారావు మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'ప్రపంచ రంగస్థలం దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనిషి జీవితాన్ని ప్రభావితం చేసేదే కళారంగమని, అలాంటి కళారాంగాన్ని, కవిత్వాన్ని ఆదరించేవారు తక్కువయ్యారన్నారు. నవరసాలను పలికించే కళారంగాలను బతికించుకోవాల్సిన అవసరం, బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సినిమాలు, సీరియల్స్ నాటక రంగాన్ని, రంగస్థలాన్ని దెబ్బతీశాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అంతకు ముందు కళాపోషకుడు తిరుపతిరావు చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కార్యక్రమానికి డాక్టర్ సంత వేలూరి కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా భక్త చింతామణి నాటకంలోని ప్రేమ సన్నివేశాలు, రామాంజనేయ యుద్ధం నాటకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు మిడసల మల్లికార్జునరావు, కనమాల రాఘవులు, డాక్టర్ నాగ భైరవ ఆదినారాయణ, తేళ్ల అరుణ, కుర్రా ప్రసాద్ బాబు, గుంటూరు సత్యనారాయణ, రాయపాటి ఆశీర్వాదం తదితరులు ప్రసంగించారు.


మాట్లాడుతున్న ప్రజా నాట్య మండలి గౌరవాధ్యక్షుడు నల్లూరి

క్వారీయింగ్ అనుమతి కోసం ప్రజాభిప్రాయ సేకరణ

చీమకుర్తి రూరల్: క్వారీయింగ్ అనుమతి కోసం అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. గురువారం మండలంలోని రామతీర్థం ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్‌లో క్వారీయింగ్ కోసం ప్రజాభిప్రాయ సేకరణ ఒంగోలు ఆర్డీవో కే.లక్ష్మి ప్రసన్న నిర్వహించారు. మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సర్వే నంబర్ 55/3ఈలో 14.17 హెక్టార్లలో క్వారీయింగ్ అనుమతి కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ రాఘవరెడ్డి అధ్యక్షతన ప్రజాభిప్రాయం సేకరించగా చీమకుర్తి, రాజుపాలెం, లక్ష్మీపురం, బూదవాడ గ్రామాల చుట్టుపక్కల పరిధిలోని ప్రజలు పాల్గొని అభిప్రాయాలు తెలియజేశారు. సమావేశం నందు ఎటువంటి అభ్యంతరాలు రాలేదు. రామతీర్థం పరిధిలో ఈఎస్‌ఐ హాస్పిటల్ నిర్మించాలని, క్వారీల్లో పనిచేసే కార్మికులు ప్రమాదానికి ఒక అంబులెన్స్, ప్రభుత్వ డాక్టర్ ఎప్పుడూ ఉండేలా చూడాలని అభిప్రాయాలు తెలిపారు.

కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్.బ్రహ్మయ్య, ఏపీఎండీసీ, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డును సైతం వదలని తెలుగు తమ్ముళ్లు

- ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న అధికారులు

మద్దిపాడు: కూటమి ప్రభుత్వం వచ్చాక తెలుగు తమ్ముళ్లు అక్రమార్జన తెరలేపారు. చెట్టు, పుట్ట, మట్టి, ఇసుకను సైతం వదలడం లేదు. ఆఖరికి పొలాకు వెళ్లే బాటను సైతం మింగేస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. తాజాగా మండలంలోని కోవివారిపాలెం వద్ద ఇసుక అక్రమంగా రవాణా చేయడానికి పొలాలకు వెళ్లే బాటను గత నాలుగు రోజులుగా చదును చేస్తున్నారు. అయితే గ్రామస్తులు పొలాలకు వెళ్లే బాటను వేయిస్తున్నారేమో అనుకుంటూ మిన్నకుండిపోయారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం గుండ్లకమ్మ నదిలోకి ర్యాంప్ ఏర్పాటు చేయడంతో అసలు విషయం తెలుసుకున్న రైతులు తహశీల్దార్ సుజన్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. మండలంలోని బసవన్నపాలెం అనుబంధగ్రామం కోవివారిపాలెం నుంచి గుండ్లకమ్మకు వెళ్లే బాటను చదును చేసి గుండ్లకమ్మ నదిలో ర్యాంప్ ఏర్పాటు చేస్తున్నారని తద్వారా మా పొలాలు దెబ్బ తింటాయని గ్రామానికి చెందిన ఆర్ల వెంకటేశ్వర్లు అనే రైతు తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్, సిబ్బంది హుటాహుటిన అక్కడకు వెళ్లారు. ఆ స్థలంలో ఇసుక తవ్వుతున్న జేజీబీ, ఇసుకను తరలించడానికి లారీ కనిపించాయి. అధికారులు గుండ్లకమ్మ నది మధ్యలోనికి వెళ్లి చూడగా ఇసుక తవ్విన ఆనవాళ్లు కనిపించాయి. దీంతో తహసీల్దార్ ఎస్ఐ శివరామయ్యకు ఫోన్ చేయగా కానిస్టేబుళ్లను పిలిపించారు. వారితో జేసీబీని సీజ్ చేయించి మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఆర్ఐ రమణయ్య వీఆర్‌ఓ, రెవెన్యూ శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.


నదిలో ర్యాంప్‌ను పరిశీలిస్తున్న తహశీల్దార్ సుజన్‌కుమార్, రైతులు

అర్బన్ ప్రాపర్టీ సర్వే ప్రారంభం


సర్వేని పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: నగరంలోని క్లౌ పేట సచివాలయం పరిధిలో జరుగుతున్న నక్ష సర్వే కార్యక్రమాన్ని గురువారం ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా చేపట్టిన సర్వేలో రాష్ట్రం నుంచి 10 మున్సిపాలిటీలు మాత్రమే ఎంపిక య్యాయన్నారు. వాటిలో ఒంగోలు నగర పాలక సంస్థ కూడా ఉందన్నారు. ఈ సర్వే ద్వారా అర్బన్ ప్రాపర్టీస్ అన్ని డిజిటలైజేషన్ చేస్తామని, సర్వేను 45 రోజుల్లో పూర్తి చేసేందుకు నగరంలో 42 బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో టీపీఓ బాబురావు, టీపీఎస్ శివ ప్రసాద్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా నివారణకు ముందస్తు చర్యలు

చీమకుర్తి రూరల్: మండలంలోని రామతీరంలో బండ్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది మలేరియా కేసులు నివారణకు ముందస్తు చర్యలు చేపట్టారు. గురువారం రామతీర్థంలో మలేరియా కేసులు పెరుగుతుండటంతో కమ్యూనిటీ హెల్త్ అధికారి సీహెచ్ మాధవరావు నివాసగృహాలకు, బంకులకు డీడీటీ బదులు ఆల్ఫా సైపర్‌మెత్రిన్ పౌడర్‌ను పిచికారీ చేయించారు. ఆల్ఫా సైపర్ మెత్రిన్ 45 రోజులు వరకు పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టాలి



మాట్లాడుతున్న బీసీ సంఘనాయకులు

ఒంగోలు వన్‌టౌన్: ప్రభుత్వం వెంటనే బీసీ కుల గణనను చేపట్టాలని బీసీ సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ బీసీ రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జిల్లాకు వచ్చిన ఆయన 52 శాతం ఉన్న బీసీ కులగణను అధికారికంగా నిర్వహించాలన్నారు. ఈసందర్భంగా బీసీ సమన్వయ కమిటీ చైర్మన్ బొట్ల సుబ్బారావు మాట్లాడుతూ 30 లక్షల యాదవులు ఉంటే కేవలం 46 మంది మాత్రమే ఇప్పటి వరకు చట్ట సభలకు వెళ్లారన్నారు. పది లక్షలు ఉన్న వడ్డెరలు ఒక్కరు కుడా అసెంబ్లీకి వెళ్లలేదన్నారు. బీసీ సమన్వయ కమిటీ రాష్ట్ర అధికార ప్రతినిధి ధరణికోట లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బీసీల పార్టీ అని చెప్పుకుంటూ మాకు మాత్రం ఎటువంటి అవకాశాలు ఇవ్వడంలేదన్నారు. దీనికి నిరసనగా జ్యోతిరావు పూలే వర్ధంతి ఏప్రిల్ 11న కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గుంటూరు మస్తాన్ రావు, చావలి సుధాకర్, గిరిజన నాయకులు పేరం సత్యం, టీ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లకు నిధుల విడుదల

ఒంగోలు వన్‌టౌన్: ఆంధ్రకేసరి యూనివర్శిటి పరిధిలోని 58 ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బీ హరిబాబు గురువారం లాంఛనంగా నిధులను విడుదల చేశారు. యూనివర్సిటీ పరిధిలో ఆచార్య నాగార్జున యూనివర్శిటి నుంచి బదిలీ అయిన 58 యూనిట్లకు మాత్రమే నిధులు మంజూరయ్యాయి. ఒక్కో యూనిట్‌కు రూ.19 వేల చొప్పున మొత్తం రూ 11.02 లక్షలను ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఆంధ్ర కేసరి యూనివర్శిటి గుర్తింపుతో ఉన్న కళాశాలల్లో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు గల కళాశాలల బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ అయ్యాయి. కోఆర్డినేటర్ డాక్టర్ మండే హర్షప్రీతం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ మరణంపై నిజాలు నిగ్గుతేల్చాలి


ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవ సంఘాలు

సంతనూతలపాడు: పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై నిజాలు నిగ్గు తేల్చాలని మండలం పాస్టర్ల యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. పాస్టర్ ప్రవీణ్ ఇటీవల రాజమండ్రిలో ప్రమాదంలో అనుమానస్పదంగా మృతి చెందడంపై మండల పాస్టర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ర్యాలీ, కొవ్వొత్తుల ప్రదర్శన, సంతాపం, ఆదరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రవీణ్ సేవకుడు, మంచి వక్త అని, అతని మృతిపై ప్రభుత్వం స్పందించి విచారణ చేసి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. పాస్టర్ ప్రవీణ్ మృతికి పలువురు పాస్టర్లు ఈ సందర్భంగా సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంకారావు, సీపీఎం నాయకులు ఎస్ వెంకటేశ్వర్లు, మండల పాస్టర్ సంఘాల యూనియన్ అధ్యక్షుడు టీ. జాషువా తదితరులు పాల్గొన్నారు.

బాలికల రక్షణ మనందరి బాధ్యత


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు

చీమకుర్తి: సమాజంలో బాలికల రక్షణ మనందరిపై ఉంటుందని సీఐ ఎం.సుబ్బారావు పేర్కొన్నారు. గురువారం చీమకుర్తి ప్రభుత్వ హైస్కూలులోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో బాలికల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలకు తెలిపారు. బాలికల రక్షణ చట్టం, పోక్సో కేసులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ-1, 2 నరశింహరావు, శివాజీ, హెచ్ఎంలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు


ప్రకృతి వ్యవసాయ సాగును పరిశీలిస్తున్న రాష్ట్ర వ్యవసాయ బృందం

కొత్తపట్నం: ప్రకృతి వ్యవసాయం ఎంతో లాభదాయకంగా ఉంటుందని కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వీ సుభాషిణి పేర్కొన్నారు. గురువారం మండంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న పొలాలను రాష్ట్రస్థాయి ప్రకృతి వ్యవసాయ బృందం, సెర్ప్ అధికారులు పరిశీలించారు. మండలంలో గాదెపాలెంలో గుత్తికొండ వెంకట జాన్సీ ప్రకృతి వ్యవసాయంతో శనగ, ఏ గ్రేడ్ మోడల్‌ను పరిశీలించారు. కొత్తపట్నంలో మూబుది వెంకటేశ్వర్లు కూరగాయలను, కోమట్ల నాంచార్‌రెడ్డి నవధాన్యాలు, సాగును పరిశీలించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, రాజేశ్వరరావు, వెలుగు డీపీఎం డేవిడ్, ఏవో మోహన్‌రెడ్డి, ఏపీఎం విజయలక్ష్మి, ప్రకృతి సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిపాడు: మండలంలోని వెల్లంపల్లి గ్రామంలో సేంద్రియ పద్ధతుల ద్వారా సాగుచేస్తున్న వివిధ పంటలను అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి వీ నాగేశ్వరరావు, ఐసీఆర్పీ ఊహ, కన్సల్టెంట్ శ్రీ ఎం రాజశేఖర్, చంద్రశేఖర్, ఏపీఎం కే సుబ్బారావు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను ఉపసంహరించుకోవాలి


ధర్నా చేస్తున్న నాయకులు

ఒంగోలు వన్‌టౌన్: ఎస్సీ వర్గీకరణను ఉపసంహరించుకోవాలని మాల ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రకాశం భవన్ వద్ద మాల ఉద్యోగులు, మాల జేఏసీ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణకు నిరసనగా మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘ నాయకులు మాట్లాడుతూ.. శాసన సభలో నామమాత్రపు చర్చ చేసి, శాసన మండలిలో చర్చించి ఒప్పించలేక ఆర్డినెన్స్ ద్వారా దొడ్డి దారిన వర్గీకరణ చేపట్టారని విమర్శించారు. భారత రాజ్యాంగం ప్రకారం షెడ్యూల్ కులాల జాబితాలో ఎటువంటి మార్పులు చేయాలన్నా పార్లమెంటుకు మాత్రమే అధికారం ఉందన్నారు. అదేవిధంగా షెడ్యూల్ కులాల జాతీయ కమిషన్‌ను సంప్రదించకుండా సవరణలుగానీ, వర్గీకరణలుగానీ చేయకూడదని స్పష్టంగా ఉందన్నారు. అయినా ప్రభుత్వాలు అన్యాయంగా, బలవంతంగా అణగారిన కులాలపై దౌర్జన్యపూరితంగా వ్యవహరిస్తుండటం దారుణమన్నారు. కార్యక్రమంలో బిళ్లా చెన్నయ్య, బిళ్లా వసంతరావు, యరమాల మల్లికార్జున, కాటుకూరి బాబురావు, పాలేటి కొటేశ్వరరావు, మిట్నసల శాంతారావు, రమేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

సంతనూతలపాడు: మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందు నిలుస్తుందని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. మండలం కేంద్రం సంతనూతలపాడులోని పెద్ద బజార్‌లో ఉన్న మసీద్‌లో గురువారం ఆ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్టీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, దుంపా యలమందారెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు ముస్లిం సోదర, సోదరీమణులకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం మత పెద్దలు వస్తద్ ఫిరోజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు షేక్ రహంతుల్లా, ఉప సర్పంచ్ ఐవీ సుబ్బయ్య, నాయకులు దుంపా ఇంద్రసేనారెడ్డి, కుంచాల నాగంజనేయులు, కే అంకుల్, తన్నీరు మోహన్‌రావు, వల్లెపు శ్రీను, డాక్టర్ శ్రీనివాసరావు, కొత్తపల్లి సుబ్బయ్య, షేక్ మస్తాన్ వలి, కాలేషా, గౌసాని, ఖాదర్, హుస్సేన్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న నాయకులు